# రాష్ట్రంలో 1956 అనంతర రాజకీయ పరిణామాలు

వచ్చే నవంబర్ ఒకటి నాటికి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటై 52 ఏళ్లు పూర్తవు తాయి. ఐదు దశాబ్దాల కాలంలో... రాష్ట్రం రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో చెప్పుకోదగ్గ ప్రగతి సాధించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొమ్మిదేళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్ అవతరించింది. తెలుగు ప్రాంతాల్లో మొదటి నుంచీ కాంగ్రెస్‌కే రాజకీయ ఆధిపత్యం లభించింది. 1955లో ఆంధ్ర రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో మాత్రమే భారత కమ్యూనిస్టు పార్టీ(అవిభక్త సీపీఐ) గట్టి పోటీ ఇచ్చింది. ఆ తర్వాత దాదాపు మూడు దశాబ్దాల వరకు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీదే గుత్తాధిపత్యం.

### 1956, నవంబరు 1న:

1953, అక్టోబర్ 1న అవతరించిన ఆంధ్ర రాష్ట్రంలోని 9 జిల్లాలు.. పూర్వపు హైదరాబాద్ స్టేట్‌లోని 11 జిల్లాలను కలిపి... 1956, నవంబర్ 1న హైదరాబాద్ రాజధానిగా.. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేశారు. కోస్తా జిల్లాలతో పోలిస్తే.. తెలంగాణ వెనుకబడి ఉన్న కారణంగా.. ఈ ప్రాంత అభివృద్ధికి కొన్ని హామీలు ఇస్తూ.. పెద్ద మనుషుల ఒప్పందంపై మూడు ప్రాంతాల నేతలూ సంతకాలు చేశారు. దాంతో తెలుగు వాళ్లంతా ఒకే రాష్ట్రంలో కలిసి జీవించే అవకాశం వచ్చింది. 1953, డిసెంబర్‌లో జస్టిస్ సయ్యద్ ఫజల్ అలీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్(ఎస్సార్సీ) సిఫార్సుల ఆధారంగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించింది. 1955 మధ్యంతర ఎన్నికల్లో గెలిచిన ఆంధ్ర రాష్ట్ర ఎమ్మెల్యేలు.. 1952లో ఎన్నికైన తెలంగాణ ప్రాంత శాసనసభ్యులతో ఆంధ్రప్రదేశ్ తొలి శాసనసభ ఏర్పాటైంది.

### సీఎంగా సంజీవరెడ్డి:

కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) నాయకత్వానికి జరిగిన ఎన్నికల్లో... పూర్వపు ఆంధ్ర రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి బెజవాడ గోపాల రెడ్డిపై... విజయం సాధించిన రాయలసీమ నేత నీలం సంజీవరెడ్డి మొదటి ముఖ్యమంత్రి అయ్యారు. అప్పటికే మంత్రి పదవులు చేపట్టి, రాజకీయ అనుభవం గడించిన సంజీవ రెడ్డి... కొత్త రాష్ట్రంలో పరిపాలనలో.. రాజకీయాల్లో... వెంటనే గట్టి పట్టు సంపాదించగలిగారు. ముఖ్యమంత్రి అయిన ఆరు నెలల్లోపే 1957లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో(శాసనసభ ఎన్నికలు తెలంగాణలోనే జరిగాయి).. కాంగ్రెస్ విజయం సాధించింది.

సంజీవరెడ్డి మరోమారు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. అయితే, తొలి సీఎంగా ఐదేళ్లు పూర్తి కాకముందే ఆ పదవికి రాజీనామా చేశారు. 1960లో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఆయన ఎన్నికవడమే ఇందుకు కారణం. నీలం రాజీనామా చేయడంతో కర్నూలు జిల్లాకు చెందిన హరిజన నేత దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు.. ప్రధాన ప్రతిపక్షమైన సీపీఐ పుంజుకోకపోవడం... తదితర కారణాలతో సంజీవయ్య నేతృత్వంలోని కాంగ్రెస్.. 1962 శాసనసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. కాంగ్రెస్‌కు 177 సీట్లు రాగా.. 51 స్థానాలు సంపాదించిన కమ్యూనిస్టు పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. రైతు నాయకుడు ఎన్.జి.రంగా నాయకత్వంలోని స్వతంత్రపార్టీకి 19 సీట్లు లభించాయి.

రెండేళ్లు ముఖ్యమంత్రిగా మంచి ఫలితాలే సాధించినప్పటికీ... ఈ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక సంజీవయ్యను ఏఐసీసీ అధ్యక్ష పదవిని చేపట్టాలని పార్టీ అధిష్ఠానం కోరింది. దీంతో ముఖ్యమంత్రి పదవి మరోసారి సంజీవరెడ్డికే దక్కింది. ఈ సారి కూడా ముఖ్యమంత్రిగా ఐదేళ్లు కొనసాగే అవకాశం ఆయనకు దక్కలేదు.

రాయలసీమలో బస్సు రూట్ల జాతీయీకరణకు సంబంధించి, ప్రధానంగా కర్నూలు జిల్లా రూట్ల కేసులో సుప్రీంకోర్టు తన ప్రభుత్వంపై చేసిన వ్యతిరేక వ్యాఖ్యల నేపథ్యంలో... నీలం, నైతిక కారణాలపై 1964, ఫిబ్రవరి 28న రాజీనామా చేశారు.

### వరుసగా మూడో విజయం:

సంజీవరెడ్డి అనుచరుడిగా... రాజకీయాల్లో రాణించిన గుంటూరు జిల్లాకు చెందిన కాసు బ్రహ్మానందరెడ్డి... సీఎల్పీ నేతగా ఎన్నికై, ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన అధికారంలోకి వచ్చిన 1964లోనే ప్రధాన ప్రతిపక్షమైన కమ్యూనిస్టు పార్టీ చీలిపోయింది. రెండేళ్ల తర్వాత 1967, మార్చిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో... కాంగ్రెస్ వరుసగా మూడోసారి ఘన విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 167 సీట్లు వచ్చాయి. చీలిక తర్వాత తొలిసారి వేర్వేరుగా పోటీచేసిన సీపీఐకు 9, సీపీఎంకు 10 స్థానాలు లభించాయి.

ఆ ఎన్నికల్లో పార్టీ టికెట్ లభించక కాంగ్రెస్ నేతలు కొందరు తిరుగుబాటు అభ్యర్థులుగా రంగంలోకి దిగారు. వారిలో చాలామంది గెలవడంతో... అసెంబ్లీకి ఎన్నికైన ఇండిపెండెంట్ల సంఖ్య 68కి పెరిగింది. బ్రహ్మానందరెడ్డి మరోమారు ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఈ ఎన్నికల ముందు విశాఖపట్నంలో ఉక్కు ఫ్యాక్టరీ స్థాపించాలని కోరుతూ కొంత కాలం ఉద్యమం నడిచింది. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రుల డిమాండ్‌ను ఆమోదించడంతో... జనం ఆందోళన విరమించారు.

### 1969- ఉద్యమం:

మొదటిసారి సీఎంగా మూడేళ్లు కొనసాగిన కాసు... మళ్లీ ఎన్నికల్లో విజయం సాధించాక ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండలేదు. తెలంగాణ ప్రాంతానికి, సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో న్యాయం జరగలేదని చెబుతూ... ప్రత్యేక రాష్ట్రంకోసం 1969లో మొదలైన తెలంగాణ ఉద్యమాన్ని... బ్రహ్మానందరెడ్డి ఎదుర్కోవాల్సివచ్చింది. 1970 నాటికి తెలంగాణ

SAKSHI

ఆందోళన ముగిసింది.. మర్రి చెన్నారెడ్డి, టి.అంజయ్య, జి.వెంకట స్వామి, కొండ లక్ష్మణ్ బాపూజీ వంటి కాంగ్రెస్ నేతలు... తెలంగాణ ప్రజా సమితి(టీపీఎస్) అనే రాజకీయ పార్టీ స్థాపించారు.

దాంతో.. 1971లో జరిగిన లోక్‌సభ మధ్యంతర ఎన్నికల్లో... కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో కాంగ్రెస్ తిరుగులేని విజయం సాధించినప్పటికీ.. తెలంగాణలో కేవలం మూడు సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. తెలంగాణలోని మొత్తం 14 సీట్లకూ పోటీ చేసిన టీపీఎస్.. పది స్థానాలు గెలుచుకుంది. పది సీట్లు గెలుచుకున్న టీపీఎస్.. కేంద్ర సర్కారు, తెలంగాణకు సంబంధించి ఇచ్చిన హామీల ఫలితంగా.. ఈ పార్టీ నేత చెన్నారెడ్డి, తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు.

## తొలిసారిగా తెలంగాణ ప్రాంత సీఎం:

రాష్ట్రం ఏర్పాటైన 14 ఏళ్ల తర్వాత తొలిసారిగా తెలంగాణకు చెందిన పి.వి.నరసింహారావు ముఖ్యమంత్రి అయ్యారు. ఇక బ్రహ్మానందరెడ్డి హయాంలో మూడు నాలుగు ప్రజా ఉద్యమాలు నడిచాయి. దాదాపు ఏడేళ్లు సీఎం పదవిలో కొనసాగిన ఆయన హయాంలోనే రాజకీయ సుస్థిరత కొంత మేర నెలకొంది. 1967-71 మధ్య కాలంలో... కాసు పాలనలోనే రాష్ట్రంలో శ్రీకాకుళం వంటి కొన్ని ప్రాంతాల్లో నక్సలైట్ ఉద్యమం ఉధృతంగా సాగింది. రాష్ట్ర మంత్రిగా అనుభవం ఉన్న పీవీ.. 1971, సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రి అయ్యారు.

ఆయన హయాంలో 1972 మార్చిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో... కాంగ్రెస్ వరుసగా నాలుగోసారి ఘన విజయం సాధించింది. ఎన్నడూ లేని విధంగా ఆ పార్టీకి 219 సీట్లు వచ్చాయి. ప్రధాని ఇందిరా గాంధీ అమలు చేసిన ఆర్థిక, సంక్షేమ విధానాలు.. కాంగ్రెస్‌కు రికార్డు స్థాయిలో గెలుపును సాధించిపెట్టాయి.

మరుసటి ఏడాది అక్టోబర్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలకు సంబంధించి... తెలంగాణలో కనీసం 12 ఏళ్లు నివసించిన స్థానికులకే ప్రాధాన్యం ఇచ్చే ముల్కీ నిబంధనలను వ్యతిరేకిస్తూ... కోస్తా, రాయలసీమల్లో ఉద్యమం మొదలైంది. చివరికి ఇది ప్రత్యేక ఆంధ్ర ఆందోళనగా మారింది. పీవీ మంత్రివర్గంలోని ఈ ప్రాంతాల మంత్రులు కొందరు రాజీనామా చేశారు.

## తొలిసారి రాష్ట్రపతి పాలన:

1973, జనవరిలో పీవీ రాజీనామా చేశారు. కేంద్రం, ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా రాష్ట్రపతి పాలన విధించింది. 'జై ఆంధ్ర' ఉద్యమం ఆరు నెలల తర్వాత ముగిసింది. ఇందిరా గాంధీ సర్కారు ఆంధ్రా నేతలకు కొన్ని హామీలు ఇవ్వడంతో... ఆందోళన విరమించారు. 11 నెలల తర్వాత మామూలు పరిస్థితులు నెలకొన్నాక తెలంగాణకే(ఖమ్మం జిల్లా) చెందిన మాజీ మంత్రి జలగం వెంగళరావు నాయకత్వంలో... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. కేంద్రంలో మొదటిసారి అధికారం కోల్పోయిన ఏడాదికి, అంటే... 1978, జనవరిలో కాంగ్రెస్ చీలింది. కాసు బ్రహ్మానందరెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్‌లో జలగం కొనసాగారు. మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలోని ఇందిరా కాంగ్రెస్.. మార్చిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 175 సీట్లతో ఘన విజయం సాధించింది. చెన్నారెడ్డి నాయకత్వాన కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది.

## ప్రాంతీయ పార్టీగా తెలుగుదేశం:

ఐదేళ్లు కాంగ్రెస్ పాలన సాగినా.. ముఖ్యమంత్రులు నలుగురు వచ్చారు. చెన్నారెడ్డి తర్వాత 1980, అక్టోబర్‌లో తెలంగాణకే చెందిన టంగుటూరి అంజయ్య సీఎం అయ్యారు. ఆయన కూడా పార్టీలో అసమ్మతి కారణంగా 1982, ఫిబ్రవరిలో.. అంటే.. ఏడాదిన్నరకే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అంజయ్య తర్వాత ముఖ్యమంత్రి పదవి చేపట్టిన భవనం వెంకట్రాం(గుంటూరు జిల్లా) పాలన కేవలం ఆరు నెలలే సాగింది.

ఆయన హయాంలోనే సినీ నటుడు నందమూరి తారక రామారావు... 'తెలుగువారి ఆత్మగౌరవం' అనే నినాదంతో.. తెలుగుదేశం పార్టీ స్థాపించారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో కర్నూలు జిల్లాకు చెందిన కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రి పదవిని చేపట్టి... 1983, జనవరి అసెంబ్లీ ఎన్నికల వరకూ కొనసాగారు. రాష్ట్రంలో తొలిసారిగా కాంగ్రెస్ ఓటమి పాలైంది. తెలుగుదేశం ప్రాంతీయ పార్టీగా అవతరించి కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఆవిర్భవించింది. ఎన్.టి. రామారావు అధికారం చేపట్టారు. తదనంతర రాజకీయ పరిణామాల నేపథ్యంలో... 1985, మార్చిలో అసెంబ్లీకి మధ్యంతర ఎన్నికలు జరిపించారు. మళ్లీ విజయం సాధించిన ఎన్టీఆర్.. 1989 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయే వరకూ ముఖ్యమంత్రిగా కొనసాగారు. ఈ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్... మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దనరెడ్డి, కోట్ల విజయ భాస్కరరెడ్డి ముఖ్యమంత్రులుగా ఐదేళ్లు అధికారంలో ఉంది.

## కాంగ్రెస్ సర్కారుకు నాలుగేళ్లు:

1994 అసెంబ్లీ ఎన్నికల్లో... 225 సీట్లతో ఘన విజయం సాధించిన తెలుగుదేశం... ఎన్టీఆర్ నేతృత్వంలో మూడోసారి అధికారంలోకి వచ్చింది. ఏడాది తిరగకుండానే తెలుగుదేశంలో ఏర్పడిన అంతర్గత సంక్షోభం ఫలితంగా... నారా చంద్రబాబు నాయుడు 1995, సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రి అయ్యారు. 1999 ఆగస్టు-సెప్టెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం బలం 180 సీట్లకు పడిపోయినా... అధికారం మాత్రం నిలబెట్టుకోగలిగింది.

ఆ తర్వాత విద్యుత్ ఛార్జీల పెంపు, ఆర్థిక సంస్కరణల అమలులో లోపాల కారణంగా... తెలుగుదేశం జనాదరణ కోల్పోవడం మొదలైంది. చంద్రబాబు అసెంబ్లీ రద్దుచేయించి, 2004 ఏప్రిల్-మేలో ముందస్తు ఎన్నికలు జరిపించారు. ఈ ఎన్నికల్లో వామపక్షాలు, టీఆర్ఎస్‌తో కలిసి పోటీ చేసిన కాంగ్రెస్... 180కి పైగా సీట్లు గెలుచుకుని... వైఎస్ రాజశేఖరరెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వంలో చేరిన టీఆర్ఎస్... ఏడాది తర్వాత కేబినెట్ నుంచి వైదొలగింది. ముఖ్యమంత్రి వైఎస్ నాయకత్వంలో కాంగ్రెస్ సర్కారు గత మే నెలలో నాలుగేళ్లు పూర్తి చేసుకుంది!!

SAKSHI

# ఆంధ్రప్రదేశ్... ప్రధాన సంఘటనలు

## పెద్ద మనుషుల ఒప్పందం:

ఆంధ్రప్రదేశ్ అవతరణకు దారితీసిన పరిణామాల్లో ముఖ్యమైంది 'పెద్దమనుషుల ఒప్పందం'. 1953, అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ముందు... మద్రాసులోని ఆంధ్రపత్రిక స్థాపకుడు దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు నివాసంలో... కోస్తా, రాయలసీమ నేతల మధ్య 1937లో కుదుర్చుకున్న శ్రీబాగ్ ఒప్పందం లాంటిదే ఇది. దేశ రాజధాని ఢిల్లీలో.. అప్పటి కేంద్ర హోంమంత్రి పండిట్ గోవింద వల్లభ్ పంత్ (జి.బి.పంత్) నివాసంలో.. 1956లో పెద్దమనుషుల ఒప్పందం కుదిరింది. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతానికి చెందిన నాయకులు దీనిపై సంతకాలు చేశారు. వెనుకబడిన తెలంగాణ ప్రాంతానికి సమైక్య ఆంధ్రలో... న్యాయం జరుగుతుందని లిఖిత పూర్వక హామీ ఇవ్వడమే ఈ ఒప్పందం లక్ష్యం. పెద్ద మనుషుల ఒప్పందంపై బూర్గుల రామకృష్ణారావు, కె.వి.రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి, జె.వి.నర్సింగ్‌రావు, నీలం సంజీవరెడ్డి, గౌతు లచ్చన్న, అల్లూరి సత్యనారాయణరాజు, బెజవాడ గోపాలరెడ్డి సంతకాలు చేశారు.

ఈ ఒప్పందం ప్రకారం... సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి ఆంధ్ర ప్రాంతానికి చెందిన నేత అయితే... ఉపముఖ్యమంత్రిగా తెలంగాణ వ్యక్తిని నియమిస్తారు. తెలంగాణకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉంటే... ఆంధ్ర ప్రాంత నేతను ఉపముఖ్యమంత్రిగా నియమించాలి. రాష్ట్ర కేబినెట్‌లో ఆంధ్ర, తెలంగాణ మంత్రులు 60 : 40 నిష్పత్తిలో ఉండాలి.

ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణ సాఫీగా సాగేందుకు తెలంగాణ ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా పరిగణించడంతోపాటు తెలంగాణకు ప్రాంతీయ స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తారు. ఇందులో తెలంగాణకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు సభ్యులు. రాష్ట్ర ప్రభుత్వ సబార్డినేట్ సర్వీస్ ఉద్యోగ నియామ కాల్లో... తెలంగాణ ప్రాంతానికి ముల్కీ నిబంధనలు అయిదేళ్ల పాటు కొనసాగేలా చూడటం కూడా ఈ ఒప్పందంలోని మరో ముఖ్యాంశం. దీని ప్రకారం ఈ తరహా ఉద్యోగాల్లోకి... ఈ ప్రాంతంలో పన్నెండేళ్లు నివసించిన (ముల్కీ) వారినే పరిగణనలోకి తీసుకోవాలి. కొత్త రాష్ట్రంలో పరిపాలన (కేంద్ర, రాష్ట్ర) వ్యయాన్ని... ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు తమతమ ఆదాయాల నుంచి తగు నిష్పత్తిలో భరిస్తాయి. మిగులు ఆదాయాన్ని తెలంగాణ అభివృద్ధికి ఖర్చుచేస్తారు. తెలంగాణలోని సాంకేతిక విద్య సహా అప్పటికున్న విద్యా సంస్థల్లో తెలంగాణ విద్యార్థులకు తొలి ప్రాధాన్యమిస్తారు. ఒప్పందంపై సంతకం చేసిన ఎనిమిది మంది పెద్దమనుషుల్లో.. నీలం సంజీవరెడ్డి, మర్రి చెన్నారెడ్డిలు ముఖ్యమం త్రులయ్యారు.

## ముల్కీ నిబంధనలు:

ఆంధ్రప్రదేశ్ అవతరించాక... తెలంగాణలో ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యం ఇచ్చే ఉద్దేశంతో ముల్కీ నిబంధనలను అమలు చేశారు. పూర్వపు హైదరాబాద్ స్టేట్‌లో నిజాం కాలంలోనే... ప్రభుత్వ ఉద్యోగాల్లో ఇతర రాష్ట్రాల వారిని నియమించేవారు. దీనిపై ప్రజల్లో నిరసన వ్యక్తమవడంతో... 1918లోనే నిజాం సర్కారు ముల్కీ నిబంధనలు రూపొందించింది. ముల్కీలు అంటే... ఈ ప్రాంతంలో జన్మించినవారు, లేదా ఇక్కడే పన్నెండేళ్లు నివసించినవారు. కొన్ని రకాల ఉద్యోగాల నియామకాల్లో ఈ నిబంధనలు పాటించాలి. మొదట అయిదేళ్ల వరకే ఈ నిబంధనలు అమలు చేయాలనుకున్నారు. అయితే, లక్ష్యం నెరవేరకపోవడం.. ఆ కారణంగా 1968 నాటికి తెలంగాణ ప్రజల్లో అసంతృప్తి మొదలవడంతో... మరో అయిదేళ్లు పొడిగించాలని కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం సిఫార్సు చేసింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నడుస్తున్న సమయంలోనే.. 1969, మార్చిలో.. ముల్కీ నిబంధనలు రాజ్యాంగబద్ధం కావని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఉద్యోగాలను స్థానికులకు రిజర్వ్ చేయడానికి వీలు కల్పించే నిబంధనలు చెల్లవని స్పష్టం చేసింది. ఆ నేపథ్యంలో.. 1971, సెప్టెంబర్‌లో... కేంద్ర ప్రభుత్వానికి, మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలోని తెలంగాణవాదులకు మధ్య ఒక ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం.. కేంద్రం ఆధ్వర్యంలో ముల్కీ నిబంధనలు మరి కొన్నేళ్లు పొడిగించారు. సవరించిన నిబంధనల అమలు సక్రమమేనని 1972, అక్టోబరులో సుప్రీంకోర్టు తీర్పుచెప్పింది. దాంతో వీటి అమలుకు వీలుగా... 1972, డిసెంబరు 21న లోక్‌సభలో ముల్కీ నిబంధనల బిల్లును ఆమోదించారు. అదే సమయంలో ఉధృతంగా సాగుతున్న ప్రత్యేక ఆంధ్ర ఆందోళనను విరమింపజేయడానికి కేంద్రం ఓ రాజీ సూత్రం ప్రతిపాదించింది. ఆరు సూత్రాల ఈ ఫార్ములా ప్రకారం... ముల్కీ నిబంధనల స్థానంలో ప్రత్యేక ఏర్పాటు జరిగింది. విద్య, ఉద్యోగాల్లో స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలనే నిబంధన తెలంగాణకే గాక... రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, జిల్లాలకు వర్తింపజేశారు.

## పంచాయతీరాజ్ వ్యవస్థ:

పంచాయతీరాజ్ వ్యవస్థను 1959, నవంబరు 1న ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి హయాంలో ప్రవేశపెట్టారు. ఈ వ్యవస్థను తొలిసారిగా... రాజస్థాన్‌లో 1957, అక్టోబరు 2న అమల్లోకి తెచ్చారు. రాష్ట్రంలో జిల్లా పరిషత్, పంచాయతీ సమితి, గ్రామ పంచాయతీలు అనే మూడంచెల వ్యవస్థ ఏర్పడింది. పంచాయతీరాజ్ సంస్థలకు మొదట్లో క్రమం తప్పకుండా ఎన్నికలు జరిగేవి. చాలాకాలం తర్వాత టంగుటూరి అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో 1981లో మళ్లీ పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. 1992లో రాజ్యాంగ సవరణ ద్వారా చేసిన పంచాయతీరాజ్ చట్టం... ఇతర రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ 1993లో అమల్లోకి వచ్చింది.

SAKSHI

## నక్సల్స్ ఉద్యమం:

రాష్ట్రంలో నక్సల్స్ ఉద్యమం ఉత్తరాంధ్ర ప్రాంతం, శ్రీకాకుళం జిల్లాలో మొదలైంది. జాతీయ స్థాయిలో ఈ ఉద్యమానికి బెంగాల్‌కు చెందిన చారు మజుందార్, కానూ సన్యాల్ నాయకత్వం వహించారు. సీపీఎంలో చీలిక తర్వాత 1967, నవంబరులో మొదలైన నక్సల్ పోరాటం... 1969, ఫిబ్రవరి నాటికి వేగం పుంజుకుంది. ఈ పోరాటానికి వెంపటాపు సత్యనారాయణ, ఆదిభట్ల కైలాసం నేతృత్వం వహించారు. రాయలసీమకు చెందిన తరిమెల నాగిరెడ్డి, చండ్ర పుల్లారెడ్డి, తెలంగాణకు చెందిన దేవులపల్లి వెంకటేశ్వరరావు... నక్సల్స్ ముఖ్య నేతలు. నక్సల్ పార్టీల్లో బలమైందిగా అవతరించిన సీపీఐ (ఎం.ఎల్.) – పీపుల్స్ వార్‌ను... 1980లో కృష్ణాజిల్లాకు చెందిన కొండపల్లి సీతారామయ్య, కె.జి.సత్యమూర్తి స్థాపించారు. 2004, మేలో అధికారంలోకి వచ్చిన వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం పీపుల్స్ వార్, జనశక్తి పార్టీల నేతలతో చర్చలు జరిపింది. ఈ సమయంలోనే పీపుల్స్‌వార్, మావోయిస్ట్ కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా(ఎంసీసీఐ)ల విలీనం ఫలితంగా... సీపీఐ (మావోయిస్ట్) అనే కొత్త వామపక్ష తీవ్రవాద పార్టీ అవతరించింది.

SAKSHI